క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల: అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లిమర్ల బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఓపెన్‌హౌస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బి.గణేష్ విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సతీష్ పాల్గొన్నారు.

విజ్ఞానం పంచిన వైజ్ఞానిక ప్రదర్శన

- ఎంఈఓ రాజ్‌కుమార్



ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ రాజ్‌కుమార్

పూసపాటిరేగ: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని ఎంఈఓ ఎం. రాజ్‌కుమార్ అన్నారు. ఓక్‌ల్యాండ్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను ఆయన తిలకించారు. ఇస్రో రాకెట్ ప్రయోగ కేంద్రం, చంద్రయాన్, రోబో రెస్టారెంట్, స్మార్ట్‌సిటీ, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్ వార్మింగ్, న్యూటన్ మూడువగమన నియమం తదితర ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. ప్రదర్శనలను రెండో ఎంఈఓ పాపినాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.శంకరరావు, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రవి తిలకించారు.

గోసంరక్షణ అందరి బాధ్యత



గోశాలను ప్రారంభిస్తున్న వైద్యుడు సతీష్, తదితరులు

విజయనగరం టౌన్: గోవులను సంరక్షించడం మనందరి బాధ్యతని ప్రముఖ వైద్యుడు మాటూరు సతీష్ అన్నారు. స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోశాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గోశాలకు 25 గోవులను దత్తత తీసుకున్నామన్నారు. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని, ఆలయానికి వచ్చే భక్తులు గోవులకు పూజలు చేసి, వాటి సంరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మడిపల్లి వెంకటాచలం, కార్యదర్శి పెంటపాటి కామరాజు, శివ్వా నాని, గోకవరపు ఉదయ్, వీరభద్రరావు, సతీష్, కన్యకా పరమేశ్వరి దేవస్థానం పాలకమండలి సభ్యులు కుమ్మరి గుంట శ్రీనివాసరావు, పెంటపాటి ముత్యాలు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

విజయనగరం అర్బన్: నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ 2024 – 25, ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ 2024 – 25 పరీక్షలలో విజేతలుగా నిలిచిన స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించింది. ఎస్.పూజ్యశ్రీ, ఆర్.నీరధసాయి, ఎస్.సృజన్, జె.లివియోగ్రేస్, జి.లాస్య, బి.భూమి, లాస్య బంగారు పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ తెలిపారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, కరస్పాండెంట్ ఎం.స్వరూప, ఉపాధ్యాయులు అభినందించారు.

అరచేతిలో వైకుంఠం చూపించే ప్రయత్నం



సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.3.22 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించే ప్రయత్నం చేసిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతూనే బడ్జెట్ మొత్తాన్ని అధికంగా చూపి, అంకెలతో గారడీ ప్రదర్శించారని విమర్శించారు. ద్రవ్యలోటు, రెవెన్యూ లోటును ఏ రకంగా భర్తీ చేస్తారో చెప్పలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచేందుకు, విద్యుత్ చార్జీల భారాలు మోపకుండా పరిష్కారం చూపలేకపోయారన్నారు. రాష్ట్ర బడ్జెట్లో జిల్లా సమగ్రాభివృద్ధికి ఎలాంటి కేటాయింపులు లేకపోయినా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు,మంత్రి ఇది ప్రజాభివృద్ధి బడ్జెట్ అని ప్రశంసలు గుప్పించడం సిగ్గు చేటని అన్నారు.

ఉపాధి బిల్లుల బకాయిలు..

రూ.35 కోట్లు

- జనవరి 13 నుంచి అందని వేతనాలు
- ఆవేదనలో ఉపాధి హామీ వేతనదారులు



విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని ఉపాధిహామీ వేతనదారులు వేతన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలి డబ్బులే ఆధారంగా జీవించే కుటుంబాలకు నెలల తరబడి వేతనం అందకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. గతంలో వారంవారం బిల్లులు అందేవని, ఇప్పుడు 46 రోజులుగా వేతనం అందడంలేదంటూ వాపోతున్నారు. ఇదెక్కడి అన్యాయమంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 13 నుంచి ఉపాధిహామీ వేతనాలు అందకపోయినా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడంపై మండిపడుతున్నారు.

రూ.కోట్లలో బకాయిలు

జిల్లాలో 17 లక్షల పని దినాలకు సంబంధించి రూ.35 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. వేతనాలు చెల్లించాలని వేతనదారులు అధికారులను వేడుకుంటున్నా ఫలితం లేకపోతోంది. వేతనదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు వేతనాలు చెల్లిస్తారా అని ఎదురు చూస్తున్నారు.

3.45 లక్షల జాబ్ కార్డులు

జిల్లాలో 3.45 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 6.05 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో నాలుగు నుంచి ఐదు లక్షల మంది వేతనదారులు పనికి వెళ్తున్నారు. వేతనదారులకు 2025 జనవరి 13 వతేది నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు పనికి వెళ్తున్నా కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా చేతిలో డబ్బులు ఉండడంలేదని వాపోతున్నారు.

నివేదించాం

వేతన బకాయిలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉపాధి వేతనదారులకు 17 లక్షల పనిదినాలకు సంబంధించిన వేతనాలు అందాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

– ఎస్.శారదాదేవి, పీడీ, డ్వామా

వసతులు కల్పించేలా చర్యలు



హుద్ హుద్ ఇళ్ల సముదాయం వద్ద స్థానికుల సమస్యలను వింటున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలోని లంకాపట్నం ప్రాంతంలో హుద్ హుద్ ఇళ్ల సముదాయానికి అన్ని వసతులు కల్పించేలా త్వరలో చర్యలు చేపడతామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. హుద్ హుద్ ఇళ్ల సముదాయ ప్రాంతంలో శనివారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ సౌకర్యం, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం వంటి కనీస మౌలికసదుపాయాలు లేవని స్థానికులు కమిషనర్ వద్ద ఏకరువు పెట్టారు. దీనికి ఆయన స్పందిస్తూ తక్షణమే అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. చుట్టుపక్క ప్రాంతాలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉందని వెంటనే శుభ్రం చేయాలని ఉద్యానశాఖ అధికారి ఉమాభరణికి చెప్పారు. వారానికి రెండుసార్లు వాటర్ ట్యాంకు ద్వారా నీళ్లు వస్తున్నాయని స్థానికులు చెప్పగా ఇక నుంచి రోజు విడిచి రోజు వాటర్ ట్యాంకులు పంపిస్తామని భరోసా ఇచ్చారు. విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు వీధి దీపాలు, కుళాయి కనెక్షన్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే అనధికారికంగా హుద్ హుద్ ఇళ్లల్లో నివాసముంటున్న వారిని ఖాళీ చేయిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసరావు, ఏఈ సూరినాయుడు, తదితరులున్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

డెంకాడ: రైస్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరూ స్థానిక రేషన్ డిపో వద్ద తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ వి.పద్మావతి తెలిపారు. రేషన్ డీలర్లు ఈ పాస్ మిషన్‌తో అందుబాటులో ఉంటారన్నారు. మండల వ్యాప్తంగా 4,922 మంది ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు.

505 మంది హాజరు

నెల్లిమర్ల: పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సతివాడ మోడల్‌స్కూల్, నెల్లిమర్ల కేజీబీవీ, ఎంజేపీఏపీ, అంబేద్కర్ గురుకులాలతో పాటు మరో మూడు ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొదటిరోజు సెకెండ్ లాంగ్వేజ్ పరీక్షకు 518 మందికిగాను 504 మంది విద్యార్థులు హాజరయ్యారు. 14 మంది గైర్హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు.

వేతనాలు, ఉద్యోగ భద్రతపై భరోసా ఏది..?

విజయనగరంగంటస్తంభం: ఆప్కాస్ కార్మికుల వేతనాల పెంపు, వారి ఉద్యోగ భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎలాంటి భరోసా కల్పించలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏ.జగన్ మోహనరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఆశించారని, కానీ వారి ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లే విధంగా ఈ బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, ఎన్ఎంఆర్, వివిధప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత, టైమ్ స్కేల్ అమలు జరగలే దన్నారు. లక్షమంది కార్మికులకు పైగా ఉన్న ఆప్కాస్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి ఆప్కాస్ పరిధిలోని ఉద్యోగులు, కార్మికులను థర్డ్ పార్టీ విధానంలోకి నెట్టి వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉద్యోగ భద్రత కల్పించే విధంగా బడ్జెట్‌లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు స్పందించకుంటే ఉద్యోగులందరితో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

కార్మిక ఒప్పందాలు అమలు చేయాల్సిందే



కార్మికులతో మాట్లాడుతున్న రామారావు

నెల్లిమర్ల: కార్మికశాఖ అధికారుల సమక్షంలో గత నెల 10న విశాఖపట్నంలో కార్మికులు– జరజాపుపేట జ్యూట్‌మిల్లు యాజమాన్యం మధ్య జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. జరజాపుపేటలో కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ కార్మికులు మృతిచెందితే ఆయా కుటుంబాలకు సీనియర్టీతో సంబంధం లేకుండా గ్రాట్యుటీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2016లో రిటైర్ అయిన కార్మికులకు మూడు గ్రాట్యుటీ బకాయిల చెల్లింపునకు యాజమాన్యం ఇచ్చిన మూడు చెక్కుల్లో ఒకటి మాత్రమే చెల్లుబాటు కాగా మిగిలినవి చెక్‌బౌన్స్ అయ్యాయన్నారు. పీఎఫ్ వాటాను యాజమాన్యం చెల్లించకపోవడంతో కార్మికులకు పింఛన్ అందడంలేదన్నారు. మిల్లును యథావిధిగా నడిపి కార్మికులకు రూ.5వేలు అడ్వాన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక ఒప్పందం అమలు జరగకపోతే కార్మికశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి హైకోర్టులో కేసు వేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కె.పద్మనాభం, ఎస్.రమణ, ఎం.రాము, ఎం.కృష్ణ, టి.తాత, తదితరులు పాల్గొన్నారు.

ది గోట్ లైఫ్

- ఇదో తరహా 'ఆడు జీవితం' కథ..
- 20 ఏళ్లుగా తమిళనాట మగ్గిపోతున్న ఓ వృద్ధుని కన్నీటిగాథ
- గొర్రెల కాపరిగా వెట్టిచాకిరీ
- ఇటీవలే బంధవిముక్తి
- కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం అక్కడి వారి ప్రయత్నం
- పార్వతీపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్న అధికారులు



సాక్షి, పార్వతీపురం మన్యం: కుటుంబ పోషణ కోసం గల్ఫ్ దేశాలు వెళ్లి.. ఏజెంట్ చేతిలో మోసపోయి, అక్కడ అరబ్బుల చేతిలో చిత్రవధకు గురైన ఓ నజీబ్ కథ... ది గోట్ లైఫ్ (ఆడు జీవితం). ఓ నవల ఆధారంగా ఇటీవల విడుదలైన ఈ చిత్రం ప్రతి ఒక్కరినీ కదిలించింది. కథలో కొద్దిగా మార్పులున్నా.. అటువంటి పరిస్థితినే అనుభవించాడు అప్పారావు అనే ఓ వ్యక్తి. ప్రస్తుతానికైతే అతనిది పార్వతీపురంగానే చెబుతున్నాడు. పేరు, ఊరు అయితే గుర్తుంది గానీ.. అంతకుమించి వివరాలేవీ చెప్పలేకపోతున్నాడు. దీంతో స్వస్థలానికి తిరిగి చేరుకోలేకపోతున్నాడు. ఇటీవలే తమిళనాట వెట్టిచాకిరీ నుంచి బంధవిముక్తుడైన అతని కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

కార్మిక శాఖాధికారుల చొరవతో బంధవిముక్తి..

అక్కడి జిల్లా కార్మిక సంక్షేమ శాఖ అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా కొద్దిరోజుల కిందట కదంబంకుళం వెళ్లారు. అక్కడ గొర్రెలు మేపుతూ అప్పారావు కనిపించాడు. ఆరా తీయగా.. తాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాడినని, తన గ్రామానికి వెళ్లకుండా 20 ఏళ్లకుపైగా అక్కడే పశువులను మేపుతున్నానని వివరించాడు. అప్పారావు దీనస్థితికి చలించిన కార్మిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిముత్తు.. తక్షణమే అతనిని విడిపించేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో 20 ఏళ్ల వెట్టిచాకిరీ నుంచి బంధ విముక్తుడయ్యాడు.

20 ఏళ్ల కిందట టీ తాగేందుకు దిగి...

సుమారు 20 ఏళ్ల కిందట అప్పారావు అనే వ్యక్తి పనుల కోసమని కొంతమందితో కలిసి పాండిచ్చేరి బయల్దేరాడు. మార్గమధ్యంలో టీ కోసం రైల్వే స్టేషన్‌లో దిగాడు. ఆయన మరలా రైలు ఎక్కేలోపే అది వెళ్లిపోయింది. భాష రాదు, ఎటు వెళ్లాలో తెలియదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఈ పరిస్థితుల్లో అక్కడే కొన్నాళ్లు చిక్కుకుపోయాడు. చివరికి కలైయార్కోయిల్ ప్రాంతానికి చేరుకున్నాడు. శివగంగ జిల్లాలోని కలైయార్కోయిల్ తాలూకా కదంబంకుళం ప్రాంతంలో అన్నాదురై అనే వ్యక్తి మాటలు నమ్మి, బతుకుదెరువు కోసం అక్కడ పనికి కుదిరాడు. నాటి నుంచి గొర్రెల కాపరిగా అక్కడే మగ్గిపోయాడు. పని చేసిన కాలానికి రూపాయి కూడా జీతం లేదు. వెట్టి చాకిరీ తప్ప. ఎటు వెళ్లాలో తెలియదు. ఎవరితోనూ మాట్లాడే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలోనే 20 ఏళ్లు గడిచిపోయాయి. సొంత ఊరికి వెళ్లిపోతానని, ప్రయాణానికి డబ్బులు కావాలని ఎన్నోసార్లు యజమానికి ప్రాథేయపడినా.. ఫలితం లేకపోయింది.

పార్వతీపురమే గానీ..

20 ఏళ్లు అయిపోవడం.. అప్పటి నుంచి తనతో తెలుగు మాట్లాడేవారు ఎవరూ సరిగ్గా లేకపోవడమో ఏమో గానీ.. పేరు కోనేరు అప్పారావు అని, ఊరు విజయనగరం జిల్లా పార్వతీపురం (అప్పట్లో ఉమ్మడి జిల్లా) అని మాత్రమే అక్కడి అధికారులకు చెప్పగలుగుతున్నాడు. తమిళం, తెలుగు కలిపి మాట్లాడటం వల్ల అధికారులూ పూర్తి వివరాలను తెలుసుకోలేకపోతున్నారు. ఎలాగైనా తనను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని ఆయన ప్రాథేయపడటంతో, అక్కడి శివగంగ జిల్లా కలెక్టర్.. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను ఇటీవల ఫోన్‌లో సంప్రదించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం జిల్లా అధికారులు గ్రామంలో సంప్రదించి, ఫొటో చూపించినా.. ఎవరూ గుర్తించలేకపోయారు. ప్రస్తుతం అప్పారావు అక్కడే పునరావాస కేంద్రంలో ఉన్నాడు.

అప్పారావు కుటుంబ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాం..

ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన అప్పారావు అనే వ్యక్తి 20 ఏళ్ల నుంచి కుటుంబానికి దూరంగా ఉంటూ, తమిళనాడుకు చెందిన అన్నాదురై దగ్గర గొర్రెల కాపరిగా పని చేస్తున్నట్లు తమిళనాడు కార్మిక శాఖ అధికారులు గుర్తించారు. అప్పారావు చెబుతున్న ప్రాంతం ఒడిశా సరిహద్దులో ఉన్నట్లు ఆయన చెబుతున్న వివరాలు ఆధారంగా తెలుస్తోంది. రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు కూడా వాటిని పరిశీలించాలని ఆదేశించాం. ఆయన కుటుంబ ఆచూకీ లభ్యమైతే సమాచారాన్ని ఫోన్ 83338 13243 నంబరుకు తెలియజేయాలి.

– ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

శ్రీకాకుళంలో ఐటీడీఏ ఏర్పాటుకు కృషి చేయండి



వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు గిరిజన సంఘ నేతల వినతి

విజయనగరం అర్బన్: శ్రీకాకుళం జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని శ్రీకాకుళం గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ, జిల్లా విజిలెన్స్ మానటరింగ్ సభ్యుడు గేదెల రమణమూర్తి కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును విజయనగరంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ..

జిల్లాల విభజన వల్ల శ్రీకాకుళంలో ఐటీడీఏ లేకుండా పోయిందన్నారు. అలాగే సారవకోట, మెళియాపుట్టి, టెక్కలి ప్రాంత గిరిజనుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

'జనఔషధి'లో అందుబాటు ధరలో మందులు



ర్యాలీ చేస్తున్న వాకర్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ, జన ఔషధి కేంద్రం ప్రతినిధులు

విజయనగరం: జన ఔషధి కేంద్రాల్లో మందులు అందుబాటు ధరల్లో లభిస్తాయని, ప్రతి ఒక్కరూ ఈ కేంద్రా లను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సాయికృష్ణా వాకర్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ, జన ఔషధి కేంద్రం ప్రతినిధులు సూచించారు.

ప్రధాన మంత్రి భారతీయ జనఔషధి కేంద్రం వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కామాక్షినగర్, అయ్యన్నపేట తదితర ప్రాంతాల్లో స్థానిక సాయి కృష్ణా వాకర్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ, జన ఔషధి కేంద్రం సంయుక్తంగా శనివారం ప్రచార ర్యాలీ నిర్వహించాయి.

రెడ్ క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాద్, సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు తిరుపతిరావు, బాలు, సామాజిక కార్యకర్త దాసరి యోగేష్, జన ఔషధి నోడల్ అధికారి రామతోట రాజేష్,తదితరులు పాల్గున్నారు.

నైతిక విలువలతోనే గుర్తింపు

- విశాఖ ఇన్ఫోసిస్ డెవలెప్‌మెంట్ సెంటర్ హెడ్ నరేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశాఖ ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ నరేష్

డెంకాడ: విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకోవాలని, వాటితోనే గుర్తింపు వస్తుందని విశాఖ ఇన్ఫోసిస్ డెవలెప్‌మెంట్ సెంటర్ హెడ్ నరేష్ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరంగ్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరేష్ మాట్లాడుతూ సంస్థ ఆశయానికి అనుగుణంగా జీవన విలువలు వదిలిపెట్టకుండా పనిచేయాలన్నారు. విద్యార్థుల కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.సీతారామరాజు మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు తగ్గటు విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. కళాశాలలో అకడమిక్ ఎక్స్‌లెన్స్ సాధించిన విద్యార్థులందరికీ అతిథుల చేతుల మీదుగా బంగారు, వెండి పతకాలను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలుతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, పూర్వ విద్యార్థి కె.కిశోర్‌కుమార్, డీన్‌లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

డెంకాడలో తాగునీటి ఎద్దడి



డెంకాడ చంపావతి నదిలో బోరుబావి వద్ద అధికారులకు పరిస్థితిని వివరిస్తున్న రొంగలి కనక సింహాచలం, తదితరులు

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, గ్రామస్తులు పలువురు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు వచ్చిన భోగాపురం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వైకుంఠంనాయుడు, మండల ఈవోఆర్‌డీ శ్రీనివాస్‌కు తాగునీటి సమస్యను వివరించారు. చంపావతి నదిలో ఉన్న బోరుబావిని అధికారులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శికి అధికారులు పలు సూచనలు చేశారు. అనంతరం పెదతాడివాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

'అగ్రికల్చర్ ఔట్ రీచ్'ను సద్వినియోగించుకోండి



రుణాలకు సంబంధించి నమూనా చెక్‌ను రైతులకు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

విజయనగరం అర్బన్: రైతుల రుణాల కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్ చేపడుతున్న 'అగ్రికల్చర్ ఔట్ రీచ్' ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ వి.సుందరేషన్ సూచించారు. స్థానిక బ్యాంక్ కార్యాలయంలో ఖాతాదారులతో శనివారం జరిగిన 'అగ్రికల్చర్ ఔట్ రీచ్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అర్హులైన 27 మంది ఖాతాదారులైన రైతులకు రూ.10 కోట్ల వరకు రుణాలు ఇస్తున్నామని తెలిపారు. అనంతరం రైతులకు రుణాల అను మతుల పత్రాలను అందజేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సర్కిల్ హెడ్ వి.నీలిమ, జాయింట్ డైరెక్టర్ పశు సంవర్ధక శాఖ జేసీ డాక్టర్ వై.వి.రమణ, మెప్మా ఏఓ కె.శ్రీనివాసరావు, బ్రాంచ్ హెడ్ గంగు సంతోషి, పలువురు బ్యాంక్ ఉన్నతాధికారులను సత్కరించారు. కార్యక్రమంలో విజయనగరం బ్రాంచ్ మేనేజర్ అరుణ్‌కుమార్, బ్యాంకు అధికారులు రాజశేఖర్, తేజ, శ్రీనివాస్, పాల్గొన్నారు.